క్లుప్తంగా

వైద్యశిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చీపురుపల్లి: స్థానిక లయన్స్‌క్లబ్, లయన్స్ స్టార్స్ క్లబ్ సంయుక్తంగా పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 75 మందికి వైద్య సిబ్బంది సుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్, స్టార్స్ క్లబ్‌ల అధ్యక్షులు ఎస్.వి.జి.శ్రీనివాసరావు, సూరు దుర్గారావు, సభ్యులు ఎస్.సన్యాసిరావు, బెల్లాన వంశీకృష్ణ, డి.సీతారామరాజు, ఒమ్మి రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో తనిఖీలు



ఎస్.కోట ఆర్టీసీ డిపోలో అధికారులతో చీఫ్ మేనేజర్ అప్పలనాయుడు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో జోన్-1 డిప్యూటీ చీఫ్ మేనేజర్ బి.అప్పలనాయుడు శుక్రవారం తనిఖీలు చేశారు. కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో అమ్మకాలు, పార్శిల్ కౌంటర్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట డిపోమేనేజర్ కె.రమేష్, సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు మండల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో చేయాలని సూచించారు. జగనన్న లేఅవుట్లతో పాటు, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఏఓ డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో డెంగీ కలకలం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన 65 ఏళ్ల వ్యక్తి డి.సన్యాసిరావుకు డెంగీ జ్వరం సోకినట్టు కొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు జె.హారిక శుక్రవారం నిర్ధారించారు. బాధితుడు ప్రస్తుతం విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. బాధితుడు కడుపునొప్పి ఆయాసంతో ఎస్.కోట సీహెచ్‌సీలో ఆదివారం చేశారు. రెండురోజుల పాటు అక్కడే చికిత్స తీసుకున్నారు. ఆయాసం తగ్గకపోవడంతో వైద్యులు విజయనగరం కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. మంగళవారం శాంపిల్స్ సేకరించిన కేంద్రాస్పత్రి వైద్యులు అతను డెంగ్యూ బారిన పడ్డట్టుగా నిర్ధారించి, వైద్యం అందిస్తున్నారని, ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ హారిక తెలిపారు.

మంచి,చెడులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న జిల్లా సివిల్ న్యాయమూర్తి నాగమణి

జామి: విద్యార్థినులు మంచి, చెడులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా సివిల్‌కోర్టు న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా సాధికా ర సంస్థ కార్యదర్శి నాగమణి సూచించారు. మండలంలోని కుమరాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. అతిథిగా హాజరైన న్యాయమూర్తి నాగమణి మైనర్ బాలికల రక్షణకు సంబంధించిన, దిశ, పోక్సో తదితర చట్టాలు, న్యాయ సలహాలు పొందడం, మానవ అక్రమరవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆకర్షణలకులోనై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని విద్యార్థినులకు సూచించారు. చైల్డ్‌వెల్ఫేర్ ప్రతినిధి మాలతి, జామి ఇన్‌చార్జి ఎస్ఐ రాజేష్, కేజీబీవీ ఎస్ఓ బి.జ్యోతి, స్థానిక సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ కంది పద్మావతి పాల్గొన్నారు.

సిఫార్సులు, లంచాలకు తావులేదు

- అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



ఎస్.చింతలవలసలో లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లంచాలు, సిఫార్సులకు తావులేదని, అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు మంజూరవుతున్నా యని....అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలం లోని ఎస్.చింతలవలస గ్రామంలో శుక్రవారం ఉదయం 'గడప,గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కంది పద్మావతి, మాజీ ఎంపీపీ తిరుపతి నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రతీ కుటుంబానికి పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివ రించారు. తొమ్మిది మంది మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ శ్మశాన వాటికకు రోడ్డు కావాలని, ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరడంతో, పనులకు అంచనాలు తయారు చేయా లని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు, ఆపార్టీ నాయకులకు లంచాలు ఇస్తే కాని పనులు జరిగేవి కాదని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, పార్టీలకు అతీతంగా అర్హులకు గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పథకాలు అందిస్తు న్నామని చెప్పారు. నాడు టీడీపీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తుల కోసం విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చిందని... నేడు సీఎం జగన్ విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని అన్నారు. దేశంలో రెండో గిరిజన యూనివర్సిటీని మండలంలోని మర్రివలస సమీపంలో ఏర్పాటు చేయనున్నారని, పనులకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని వంగర, వింధ్యవాసి, మరడాం, మర్రివలస గ్రామాలకు రోడ్లు మంజూరు చేశామని చెప్పారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రాతు రాజేశ్వరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ గురుమూర్తి, స్థానిక నాయకులు ఆల్తి గణపతి, గోపి పాల్గొన్నారు.

30న పాచలవలసలో...

పాచలవలసలో ఈ నెల 30న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.



జగ్గయ్యపేటలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

ప్రజాసమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: గ్రామాల్లో ప్రజాసమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. జగ్గయ్యపేటలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించా రు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడాలనే ఉద్దేశంతో సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. నాడు-నేడు పథకం ద్వారా వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అంతకు ముందు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వేర్వేరుగా ఎమ్మెల్యేను సన్మానించారు. సర్పంచ్ వంటాకు రాములమ్మ, నెడ్‌క్యాప్‌డైరెక్టర్ సీహెచ్.పద్మావతి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, ఉప సర్పంచ్ వంటాకు శ్రీను, ఎంపీటీసీ టి.వి.రమణ, నాయకులు బుద్దా అప్పలనాయుడు, దుల్ల సన్యాసిరావు పాల్గొన్నారు.

ఇంటివద్దకే ప్రభుత్వ సేవలు



లక్కవరపుకోట: రెల్లిగౌరమ్మపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

లక్కవరపుకోట: 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు ఇంటివద్దనే అందుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. రెల్లిగౌరమ్మపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' క్యాంపులో ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీడీఓ జి.జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో నేటి వరకు 23 గ్రామ సచివాలయాల్లో 17,888 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశామన్నారు. జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్‌లు పినిశెట్టి వరలక్ష్మి, వడ్లమాని సావిత్రి, నాయకులు పినిశెట్టి కిష్టప్పదొర, లెక్కల వీరబాబు పాల్గొన్నారు.

కొత్తవలసలో ముగిసిన 'జగనన్న సురక్ష'

కొత్తవలస: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ముగిసిందని ఎంపీడీఓ వై.పద్మజ శుక్రవారం తెలిపారు.మండలంలో 24,169 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేసినట్లు ఆమె చెప్పారు. ఇంకా 353 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

సేవలు చేరువ

గుర్ల: 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు.నాగళ్లవలస, చోడవరం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' క్యాంపుల్లో ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. మండల జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, సర్పంచ్ తిరుమరెడ్డి పద్మావతి, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ సూర్యనారాయణ, నాయకులు తిరుమరెడ్డి సురేష్, బూరి రామునాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ, నాయికులు

గుర్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. సాలిపి సోమరాజుపేటలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, నాయకులు నారాయణప్పుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి



రైతులకు విత్తనాల కిట్లను అందచేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు,ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

వేపాడ: పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 15 మంది ఎస్సీ రైతులను గుర్తించి వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల విలువ చేసే వివిధ రకాల విత్తనాల కిట్లు, వ్యవసాయ పరికరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమావేశాలు నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంతో కలిగే మేలు, సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈఓ రాధాకుమారి, ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులను 236 మందిని గుర్తించామని చెప్పారు. వారందరికీ ఉచితంగా చిరుధాన్యాల విత్తనాలు, వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ అప్పారావు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూ.7.75లక్షలతో వసతిగృహ అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులోని ప్రభుత్వ గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహంలో ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహం ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుంచి రూ.7.75లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. నిరంతరం విద్యార్థినుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఎస్.కోట సర్పంచ్ డి.సంతోషికుమారి, ఎంపీటీసీ ధారగిరి, మండల ఇంజనీర్ సత్యనారాయణ, వార్డెన్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజా

గజపతినగరం రూరల్: విధుల్లో అలసత్వం వహించినా, పైఅధికారులకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైనా చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. గంగచోళ్లపెంట గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆసమయానికి సచివాలయంలో ముగ్గురే సిబ్బంది ఉండడంపై మిగతావారు ఎక్కడికి వెళ్లారని సిబ్బందిని ప్రశ్నించారు. విధుల నిమిత్తం బయటకు వెళ్లారని చెప్పడంతో, మూమెంట్ రిజిస్టర్ తనిఖీ చేశారు. రికార్డులో నమోదు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు ఆయన్ని కలిసి గ్రామ శ్మశానవాటికలో హ్యాండ్ బోరు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆయన శ్మశాన వాటికను పరిశీలించారు. బోరు మంజూరు చేయాలని పంచాయతీ విస్తరణాధికారి జనార్దన్‌ను ఆయన ఆదేశించారు.

రూ.2.5 కోట్లతో బీటీ రోడ్డు



ప్రారంభమైన రోడ్డు పనులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామం నుంచి భోజరాజపురం గ్రామానికి తారురోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈపనులకు ఏపీఆర్ఆర్‌పీ నిధులు రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు తెలిపారు. రెండు కిలోమీటర్ల మేర 30 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. మూడు మినీ కల్వర్టులు, 5 పైపు కల్వర్టులు నిర్మిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలను తొలగించి చదును చేస్తున్నారు. రోడ్డు మంజూరుకు చొరవ చూపిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం..

కొత్తవలస: పరిశుభ్రత పాటిస్తూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని ఎంపీడీఓ వై.పద్మజ అన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్-2023 వాల్ పోస్టర్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యంపై సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

వేపాడ: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన సమస్యల్లో పరిష్కరించిన వాటి వివరాలను ఎంపీడీఓ పట్నాయక్ సభకు వివరించారు. అనంతరం పలువురు సభ్యులు వ్యవసాయ, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలను సభదృష్టికి తీసుకువచ్చారు. ముకుందపురం, ఎం.శింగవరం, బానాది గ్రామాల్లో ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కనకరాజు, యశోద విద్యుత్ శాఖ అధికారులను కోరారు. చామలాపల్లి నుంచి వెంకయ్యపాలెం వెళ్లే రోడ్డులో చెరువు వద్ద కల్వర్టుకు రంధ్రం ఏర్పడిందని, మరమ్మతులు చేయించాలని చామలాపల్లి సర్పంచ్ సతీష్ ఆర్అండ్‌బీ ఏఈని కోరారు. వల్లంపూడికి జూనియర్ లైనమన్ లేకపోవడంతో వీధి లైట్లు వేసేందుకు, ఇతర విద్యుత్‌సమస్యలు తలెత్తినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వల్లంపూడి ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు సభ దృష్టికి తీసుకువ చ్చారు. ఎమ్మెల్సీ రఘురాజు స్పందించి జేఎల్ఎమ్‌లేని వావిలపాడు,వల్లంపూడి సచివాలయాలకు ఇన్‌చార్జిని నియమించేలా చూడాలని విద్యుత్‌శాఖ ఏఈ సూరిబాబుకు సూచించారు. సోంపురం-ఆనందపురం రహదారి విస్తరణలో భాగంగా చెరువుల వద్ద చేపడుతున్న పైపు కల్వర్టులకు సైడ్ వాల్‌లు నిర్మించా లని ఆర్అండ్‌బి అధికారులను ఎమ్మెల్సీ ఆదేశించారు. అలాగే అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని ఏఓకు సూచించారు. ముకుందపురం,ఓబలయ్యపాలెం జగనన్న అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు తక్షణమే ప్రారంభించేలా చొరవ చూపాలని ఆ గ్రామ సర్పంచ్ ను హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు కోరారు. జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, తహసీల్దార్ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, ముత్యాలమ్మ, మండల వ్యవసా య సలహా మండలి కమిటీ చైర్మన్ ఈర్లి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

మెరకముడిదాం: మండలంలోని గొళ్లలవలస సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ప్రారంభించనున్నారని ఎంపీడీఓ ఎం.రత్నం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, ఎంపీ బెల్లా నచంద్రశేఖర్ పాల్గొంటారని, మండల అధికారులంతా హాజరుకావాలని ఆమె కోరారు.

గజపతినగరంలో..

గజపతినగరం: మండల కేంద్రం గజపతినగరంలో శరైతుభరోసా కేంద్రం-2, వెల్‌నెస్ సెంటర్-2ల నూతన భవనాలను స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ కిశోర్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సచివాలయ సిబ్బంది, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

31 నుంచి ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

చీపురుపల్లి: జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు వంశీ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో సంబంధిత వాల్ పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 31న కొత్తవలసలో సైకిల్ యాత్ర ప్రారంభమై ఆగస్టు 9న జిల్లా కేంద్రంలో ముగుస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ మండలఉపాధ్యక్షుడు సాయికిరణ్ పాల్గొన్నారు.

ఏబీవీపీ బంద్

చీపురుపల్లి: నిబంధనలు అతిక్రమించి ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు వ్యతిరేకంగా అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) శుక్రవారం బంద్ నిర్వహించింది. పట్టణంలోని జూనియర్ కళాశాలలకు ఏబీవీపీ కార్యకర్తలు వెళ్లి విద్యార్థులను బయటకు పంపించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంపత్ మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలకు సకాలంలో పరిష్కారం

గజపతినగరం: ప్రజాసమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలని మండల అధికారులకు మండల ప్రత్యేకాధికారి పి.రమేష్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు,విత్తనాలు,పురుగు మందులకు లోటు లేకుండా అన్ని రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్, మండలపరిషత్ ఏఓ సుదర్శనం, ఈఓపీఆర్డీ జనార్దనరావు, పంచాయతీరాజ్ శాఖ డీఈ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిమిడిలో పొలంబడి

శృంగవరపుకోట: తిమిడి గ్రామంలో ఏఓ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు మట్టి పరీక్షలు చేయించి, వాటి ఫలితాల ఆధారంగా పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించా రు.

కేంద్ర కొలువులు సాధించిన వారికి సన్మానం



ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానిస్తున్న నాయికులు

గుర్ల: మండల కేంద్రానికి చెందిన యువకులు సారికి లక్ష్మణరావు, కంకణాల పూర్ణ చంద్రరావు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో వారిని స్థానిక గ్రంథాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత శుక్రవారం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇజ్జిరోతు ప్రసాద్, రౌతు సత్యనారాయణ మాట్లాడుతూ యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిసాధనకు ప్రయత్నం చేయాలన్నారు. లైబ్రేరియన్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో 'స్నేహ' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొబ్బరి, సపోటా, ఉసిరి, మామిడి, జామి తదితర మొక్కలను శుక్రవారం నాటారు.స్నేహ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వి.శ్రీరామ్మూర్తి, మంధా సుబ్బారావు, పి.వరలక్ష్మి, మళ్ల రామకృష్ణ, ఎం.ప్రకాష్, వి.మురళి, వి.రాము. హరీష్, వి.రమేష్, ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీరాములు, జి.లక్ష్మణరావు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కండి

- 'హౌసింగ్ డే 'లో అధికారులు



వేపాడ: వల్లంపూడి జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు



బొండపల్లి: బోడసింగిపేటలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, తదితరులు



జామి: దొండపర్తిలో లబ్ధిదారులకు సూచనలు చేస్తున్న ఏఈ వెంకటరావు



కొత్తవలస : ఉత్తరాపల్లిలో నిర్మాణాలను పరిశీలస్తున్న ఎంపీడీఓ పద్మజ

వేపాడ బొండపల్లి,కొత్తవలసజామి: జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని అధికారులు లబ్ధిదారు లకు సూచించారు. హౌసింగ్ డేలో భాగంగా వేపాడ మండలంలోని వల్లంపూడి, బొండపల్లి మండలంలోని బోడసింగిపేట, కొత్తవలస మండలంలోని ఉత్తరాపల్లి, జామి మండల కేంద్రంలోని దొండపర్తి జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తోందని చెప్పారు. గృహనిర్మాణాలకు సంబంధించిన బిల్లులను జాప్యం చేయకుండా నిర్మాణాల దశల ఆధారంగా ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్ అందిస్తోందని, అవసరమైన వారికి వెలుగు ద్వారా రుణాలు మంజూరు చేయిస్తున్నామని చెప్పారు. ఆయా మండలా ల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, వివిధ శాఖల ఏఈలు, ఉపాధి హామీ, వెలుగు అధికారులు పాల్గొన్నారు.